ఏకాంతప్రేమ

[ఒక చిన్న కథ.]

చిర్రావూరు కామేశ్వరరావు గారు బి. ఏ.

'రామనాథము' చాల తెలివైనవాఁడు
న్యాయవాదులలోన మెఱుఁగైనవాఁడు!
ఆంధ్రవాఙ్మయమందు నభిమాన మూని
తనకుఁ దోఁచినసేవ యొనరించువాఁడు.
చెడుగులోఁ గలమంచి కనులారఁ గాంచి
జీవనావధి సానుభూతిగాఁ దలఁచి
పేరు కెక్కినవాఁడు కడు మంచివాఁడు.
అతనిసోదరి 'శారద' యనెడు కాంత,
చక్కఁదనముల చుక్క, సుగుణాలవాల.
'నీనామ మెయ్యది?' యని యెవ్వరైన
ముచ్చటగాఁ బ్రశ్న సేయంగ, మిగుల
లజ్జించి, నెఱసంజ మోమునం బొలయఁ,
దలవాల్చు కోమలప్రాయంబునందుఁ
బరిణయం బామెకు నెఱవేర్పఁబడియె!
కాలవశంబున విధివ్రాలువలన,
పాప మాశారద వైధవ్యమొందె!—
అంతకంతకు శరశ్చంద్రికాస్ఫురణ
నిరసించి తరళించె నెఱజవ్వనంబు!
తనముద్దుచెల్లెలు దనకంటియెదుట
కడుముద్దరాలునై బ్రతుకులో వెలితి,
తలఁపులోఁ బొలయుచు ములికిరూపమునఁ
గలఁచివేయఁగ దుఃఖపడుచుంటఁ గాంచి
రామనాథము మానవ్రతమూనె నకట!
ఒకనాఁడు బంగారు మలుసంజవేళ
మేడయరుగున శారద ప్రాలుమాలి
పలుయోజనలు వెల్లివిరియంగ నెదను
బరపెఁ దీయనిచూపు పొరుగింటిపైని.
నూనూఁగుమీసాల నవయావనుండు
పసిఁడిచాయలు మోముపైఁ జిందులాడ
నగుపించె నామెకుఁ గనువిందు గొలిపి!
రామనాథము భార్య ఫలహారములను
విభుని ముంగల శుభ్రముగ సిద్ధపఱచి
దరహాసవదనంబు హృదయంబుఁ దెలుప
'వదినరో!' యని ముద్దుకలకంఠ మెత్తి
పిలువంగ, కలనుండి మేల్కాన్నరీతి
చకితయై శారద క్రిందికేతెంచె!
రామనాథము సహోదరిరాక దెలిసి
కరుణాకటాక్షమాలిక లామెపైని
బరపి యదరుపెదవులమీఁదఁ దేలి
మలకలై యొగఁ బ్రాకు మృదుహాసకాంతి,
తన మనోగతక్లేశమును గప్పివేయ
'శారదా!' యని పిల్చి మాటాడలేక
వెండిపళ్లెములోని కమలాఫలంబు
వాత్సల్యహస్తంబుతో నామె కొసఁగ!
ఆమెయు ననురాగమున దానిఁ గొనుచు
నొలిచి, తీయని యీఁడలను గొన్ని తీసి,
యన్నగారి కొసంగి కడుగారవమున,
మఱికొన్ని వదినకు మరియాద గదుర
నొసఁగి వారలతోడ కుతుకంబుతోఁగఁ
దన మనోగతమును వెలుఁగొందఁ జేసె.
రామనాథము నీటుదుస్తులం దాల్చి
జలతారు కండువా వలెవాటు వైచి
దంతపు చేతికఱ్ఱను గేల నడసి
కణుసుచర్మపుచెప్పులను కాలఁ దొడిఁగి
నల్లచీమలబారు నిరసింపఁ జాలు
మురువైన మీసాల జిగి క్రమ్ముకొనఁగ,
వీథిలోనికిఁ బోయి యూరి యావలను
గడు మనోహరశాంతిసముదంచితంబు
నిర్మలసుకుమార శాద్వలస్థలముఁ
దిలకించి తన్మధ్యమునఁ గూరుచుండె!
రాకాశశాంకుఁడు మేఘమాలికల
నూఁగులాడుచు సుధాధారలం గురిసె
శారద మేడపై నొకబొమ్మవోలె

నిలిచి యవ్యక్తసంతసము పైకొనఁగ
పొరుగింటినడవలో నుచితాసనమున
వసియించి 'టెనిసను' కవికృతంబైన
'డోరా' యను మనోహరలలితగాథఁ
జదువుచుఁ దన్మయానంద ముప్పొంగ,
హాయిగా నున్న యౌవనమోహనాంగుఁ
గాంచి నెమ్మది తన్ను విడనాడినట్లు
బొడకట్టఁ గన్నుల బాష్పము ల్జిమ్మ
'హా!' యని వెచ్చ నిట్టూర్పులఁ బుచ్చి
రామనాథము గృహమ్మున కేగుదేర
భయము నుద్వేగంబు మొలకలై తోఁప
క్రింది కేతెంచె నాచిగురాకుఁబోఁడి!

నాఁటఁగోలెను శారదాలలితాంగి
కనుకలి సమయాగఁ గడఁగె సంతతము!—
పరిమళ మకరంద బిందుతుందిలము,
మందారమంజరి కాలాగ్నిఁ బడియె!

చూపుల నవ్యక్తరాయబారములు
వెడలి యాయువకుని హృదయంబు గొనియె!
పెరటిలోఁ గల మాలతీతీఁగె టెంటఁ
గలసి యా యౌవనావిర్భావమతులు,
కడు మనోహరలీల నిశ్శబ్దనిశలు
గడపిరి సుస్నేహమున నోలలాడి!—

గిరగిర దిరిగెను కాలచక్రంబు
వింతమార్పులు దుఃఖపరిణామ మొందె
యామినీ హార్దిక సంభాషణములు
మధుశీతల మంద సంశ్లేషణములు
అవ్యక్తమగు ముగ్ధ పరితోషణములు
అంతకంతకుఁ గ్రొత్తలై ప్రేమ గొలిపి
పరిణయం బెఱుఁగని యాదంపతులను
కడు భయంకరతీరమునఁ ద్రోసివైచె!

రామనాథము సోదరీవర్తనంబుఁ
గనులారఁ గనుఁగొని కడు జాలిఁ బొంది,
"ఏమి సేయుదు నింక తలయెత్తు టెట్లు?
నవమాసములు నిండె గతి యొండు లేదు!
వేయికన్నులు దాల్చి ఛాందసోత్తములు
నాయిల్లు బెటికి పందిరి వేయఁగలరు!
అని బెంగపడి— సిగ్గుపడి— దుఃఖపడియె!

సుముఖి శారద విన్నఁదన మొంది యెడఁద
బెడిద మగు పిడుగు పడినట్లు దోఁప
తన జీవనపథంబు చిమ్మచీఁకటుల
మునిఁగిపోయెను వేఱుగతి లేదటంచు,
భయము నిస్స్పృహ సిగ్గు గలసి పైకొనఁగ
ఏకాంతమున బాష్పములు జాలువాఱ
విలవిల వసుమతీవలయంబు గదలి
పాతాళమున కేగుచున్నట్లు దోఁప
మిన్ను పైఁబడినట్లు భారంబు గాఁగ
కాంతిహీనంబైన బంగారుప్రతిమ
వలె పాప మాశారదాసుకుమారి
మందిరంబున వాఁడిములికయై తోఁచె!

ఒకనాఁడు రామనాథము భార్యతోడ
శయ్యాగృహంబున నుచితాసనమున,
నాసీనుఁడై చాలఁగా మాటలాడి
సంఘదురాచారములఁ గూర్చి పలికి,
"కటకటా! మర్యాద గలయింటఁ బుట్టి
తలవంపు గలిగించె నాముద్దుచెల్లి!—
అని కన్నుఁగవ నశ్రువులు గ్రమ్ముకొనఁగ,
నామహాత్ముఁడు ద్రెళ్లె దుఃఖానలమున

"ఎఱుకసానులు మంత్రతంత్రంబులందు
నిరుపమప్రజ్ఞాసమన్వితులైన
వారల రప్పించి బ్రతిమాలికైన
గతిఁ జూడవలె నంచుఁ దనభార్య పలుక
విని రామనాథము భయమొంది యనియె.
"వనితా! ఇదేటి వెఱ్ఱి గలిగె నీకు?
ఎవరి ప్రాప్త మెవరు దప్పింపఁగలరు?
పురాకృతఫలంబు భుజియింప వలదె?—

* * *

బాలార్కు నిరసించు సౌందర్యప్రతిభ
మిఱుమిట్లు గలిగించి వెలుఁగొందుచున్న
తన ముద్దుకొమరునిఁ గనులారఁ జూచి
పాప మా శారదాకమలాయతాక్షి
తనివి తీరక కన్నులకు నద్దినట్లు
గనుఁగొంచు వాత్సల్యభావంబుతోడఁ
గడపెను దిన మొక్క నిమిషమై తిరుగ;
గాని మనోహరుఁ డగు యౌవనుండు
చిన్నకొమరునిఁ జూడ రాకున్న వెలితి
క్రమముగాఁ బెరిఁగి, గభీరమై మఱియు
కష్టతరంబునై కలఁచివేయఁగను,

ఆ యమాయికశారద కృశింప సాగె.
జంటఁబాసిన గువ్వపిట్ట చందాన!—

భోజనప్రియులైన మొండిబ్రాహ్మణులు,
శ్లోకాలు చదువుచు చీకాకుపడుచు
పొగఁబడ్డ తేనెటీఁగల రీతి రేఁగి
గృహమున శాంతిభంగముఁ జేసినారు!

ముసలి గొల్లగురవఁ డొకనాఁటి రాత్రి
టక్కు-టక్కున చేతికఱ్ఱతో దారి
తడవుచు నరుదెంచి, "రామయ్యబాబు!—
పిలిసిన కత మేమి?—" యని కఱ్ఱమీఁద
పండుగడ్డముఁ బెట్టి నిలుచున్నయంత,
రామనాథము వలవల యేడ్చి యనియె.
"ఓగొల్లతాతా! బ్రతుకు తెల్లవాఱె!—
చాల రోజులు నిన్నుఁ బోషించినాను;
ఎట్టి ప్రతీకారమును గోరలేదు.
అనుభవంబులు చాలఁ గలిగియున్నావు;
ప్రాణరక్షణకంటెఁ బరమపుణ్యంబు
లేదులేదని శాస్త్రములు ఘోషసేయు;—
మాయింట నొక దీనుఁ డగు బిడ్డ గలఁడు,—
వాని రక్షణభారమును నీవు గొనుము!"

ముసలిగొల్లఁడు బిడ్డలవాఁడు గాన,
మురిసిపోవుచు శిశువును గొంచుపోయె.

ఆనాఁటఁగోలె శారద మాటలేక
మూఁగదయ్యమువోలెఁ దిరుగాడె నింట!

యువకుఁడు దనప్రేయసిని బాయలేక,
'శారదా! శారదా!' యని తీఁగమెలుఁగు
కంపింపఁ బిలుచుచుఁ, దమప్రేమఫలము
గొల్లవానికుటీరమున హాయిగాను
నాటల పాటల సుఖమున్నమాట
తేటతెల్లము గాఁగ నెఱిఁగించి, హృదయ
పరితాపము శమింప ముద్దాడి, విన్నఁ
దనమొంది భయమొంది, యెడఁబాసిపోవు!

రామనాథ మొసంగు ధనసహాయమున,
యువకుని ప్రోత్సాహమున గొల్లవాఁడు
బాలుని పాఠశాలకుఁ బంపఁదొడఁగె

శారద మోదించె సంవాద మెఱిఁగి.—
క్షీణమైన బాలుని మదిఁ బాయలేదు!

ఫలహారములు ఖజ్జములు పానకములు
విలువైనవస్తువులు ఈప్సితార్థములు
ప్రచ్ఛన్నముగ బాలునకు నందఁజేసి,
తనకుఁ జెందినవిధముగా నాత్మఁ దలఁచి,
సమ్మదాశ్రులు గ్రమ్మఁ బరితోష మొందు!—

బాలుఁడు చుఱుకుగా నుత్తీర్ణుఁ డగుచు,
తన యుపాధ్యాయుల యభిమాన మొంది,
నానాఁటికిఁ బ్రవర్థమానుఁడై వెలసె!

న్యాయశాస్త్రపరీక్షలోఁ దేరనెంచి,
యువకుఁ డేగెను మాఘమాసంబునందు,
నగరీలలామంబు నగు చెన్నపురికి;—
గాని గాదిలిశారదావియోగమును
భరియింపఁగాలేక పోగబండిలోన
నతఁడు పొందిన దుఃఖమును జెప్పఁగలమె?
అంతకంతకు గాఢాంధకార మయ్యె;
అందఱిలో నాతఁ డేకాకి యయ్యె!—
కను మోడ్చి, మాలతీకుంజంబునందు,
ముక్తకేశిని శారదాప్రేమగాత్రి
గాఁగిటం దనుఁ జేర్చి, నొలుఁగు రాల్పనఁగ,
చిరవియోగవిలాప గీతంబుఁ బాడె!

'ఓహృదయేశ్వర! ఓకరుణాకర!
నెమ్మది నీవింక నన్నుఁ దలంతువా?

నీపదములదరి ప్రణయవ్రతంబును,
గడగొనఁ జేయఁగ బ్రాప్తము లేదు! "ఓ"
మేఘము లాకస గోళము గప్పెను,
గడగడ పిడుగులు నెడనెడ వెడలెను! "ఓ"
పాపపుఁ గన్నులు గప్పు నిరంతర
బాష్పప్రవంతిలో మునిఁగి ప్రార్థించెద: "ఓ"
నీ నగుమోమును నామదిలోపలఁ
దాల్చి యనన్యనై దినములు గడపెద! "ఓ"
వెచ్చనిట్టూర్పుతోఁ దెలివొంది లేచి
తెరవోలెఁ జెలువొందు జలధితీరమున
నాటవెలఁదిఁ బోలి కలకలలాడు
మద్రాజనగరంబునకు వచ్చి చేరె!—

రామనాథము భార్య నింకుమాలాలు
మాతృగృహవాసమును గోరి, వేడ్క-
పొదలంగఁ దరళితదరహాస మందు
నునుసిగ్గువెన్నెలవలె నింపుకొనఁగ

కలకంఠమునఁ బ్రేమ తళుకొత్తునటులు,
స్వీయనాథున కీప్సితార్థంబు దెలిపె!
అతఁడును హృదయసమ్మతిఁ జెప్పెఁ గాని
శ్రోత్రియు లావేళ పంచాంగములను
శోధించి, యోజించి, రామనాథమును
ఎదురుచుక్క యటంచు బెదరించినారు!

చిన్నివెన్నెలతేని సరిపోలువాఁడు,
నైసర్గదరహాసమునఁ బొల్చువాఁడు,
కడుమనోహరతర సుకుమారమూర్తి
ఆదంపతుల ప్రేమఫలరూప మగుచు,
నొక కుమారుఁడు పుట్టి మోదాబ్ధిఁ దేల్చె

విమల శైశవలీలలను దేలియాడు
బాలకుని వదనమును ముద్దులాడి,
మ్లానమనోరవిందమున నొకింత
సంతోషమకరందము స్రవింప బాష్ప
ములు గ్రమ్మ కనుఁగొలంకుల నీటుఁదనము
చక్కఁదనాలమోమునఁ బ్రాఁకుకొనఁగ,
హృదయకల్లోలిని విశ్రాంతి వడయ,
మెలఁగుసోదరిఁ గాంచి, యాన్యాయవాది,
"కటకటా! ఎంతటి కష్టకాలంబు!
మాతృహృదయాగిభీరత నెన్నఁదరమె?"
యని దురంతవిషాదమునఁ గూలిపోయె!

ఆకాశమున నీలమేఘ ఖండములు
గుమిగూడి చిత్రవిచిత్రంబు లగుచు,
గర్జానినాదముల్ ప్రతిరావ మొసఁగ
తొలుకారు ముసురువానలు మొండుకొనియె!

ఒకనాఁటి చిమ్మచీఁకటిరాత్రి యందు
హోరున బెడిదంపు వడి గాలివాన
పడియె నిరంతరముగ నెల్ల యెడల!
చెట్లకొమ్మలు ఫెళ్లున విఱిగిపోయె!—

తాటియాకుల గొడుగు వలకేలఁ దాల్చి,
టక్కుటక్కున పాదుకలు భీతి గొలుప,
చేపాటి కఱ్ఱతోఁ బాటఁ జూచుచును
అర్ధరాత్రమునందు నా గొల్లవాఁడు
రామనాథము గారి యింటి కేతెంచి,
"రామయ్య బాబూ!" యని పిలిచినాఁడు.

ఆర్తనాదమువోని సంబోధనంబు
వింటనే శారద మదిఁ బోల్చుకొనియె!

దివ్వనఁ దలుపు దగ్గర కేగి, తీసి,
"ఓతాత! ఈరాత్రి నిందు వచ్చుటకుఁ
గారణం బేమి?— మాయన్నతో నేమి?—
అని కుమారునిఁ గూర్చి యడుగ నూహించి,
సిగ్గు విచారంబు పెల్లుబ్బుకొనఁగ,
కన్నుల దీనత్వ మొలుక వీక్షించె!—

అంతలో రామనాథము లేచి వచ్చి
గొల్లతాతను లోపలికిఁ బిల్చి యనియె!
"తాతా! కుమారుఁడు సుఖమున్నవాఁడె?
తలనొప్పిచేఁ జాల శ్రమ జెందినాఁడు!
అని మొన్న నమృతాంజన మడిగినావు!
మఱి యేమియును బాధ లేదుగా యిపుడు?"

ముసలిగొల్లఁడు బాష్పములు రాల్చి యనియె:
"ఓబాబు! తలనొప్పి గిలనొప్పి గాదు —
పిన్నోడు నెగనేడు కృచియించినాడు!
మెతుకైన దిననేడు పది దినా లయ్యె!
లోకాన మందు లన్నియు నేసినాము,
రచ్చరేకులు కానగాఁ గట్టినాము!
అని మోమున నేమి రాచెనో బమ్మ?
మాసీత మఱి నేడు, నీ సిత్తమయ్య!"

వాని నాలించి శారద బొమ్మవోలెఁ
జేతనం బుడిగె లోకము గూలినట్లు!

గొల్లవానితో రామనాథ మావలికిఁ
బోయి, "శారదా! పోయి వచ్చెదను!
అని గొల్లవీధికిఁ జని వానియింటఁ
జాపలో నున్న రని పొరలువాని,
మిక్కిలి కృశియించి బలము గోల్పోయి,
అస్థిపంజర రూపమున నున్నవాని,
తిలకించి, భయమొంది, యానిమేషమున
డాక్టరుగారింటి కరిగి చేదడిపి
కొనివచ్చె — అతఁడును నాడి వీక్షించి,
మోమెత్తి యోజించి, భ్రూలతి ల్మునిచి,
"ఉదయాన జ్యూబిలీవైద్యాలయమున
కితనిఁ దోడుకరండు, మందు వేసెదను!"—
అని చెప్పి యరిగె నింటికిఁ గాలినడక.

రామనాథము శారదా! యంచుఁ బిలిచి,
బాలుని యవస్థలను గూర్చి పలికె .—
కొంతసేపటికి భళ్లునఁ దెల్లవాఱె!

ముసురు తగ్గెను గొంత. కాని మేఘములు
సాంద్రంబులై సూర్యభగవానుఁ గప్పె!
చలిగాలి రివ్వున వీవంగఁ దొడఁగె;
ప్రకృతి దోఁచెను శోకమున మున్గినట్లు!
వికలాంగు లీఁగలవలె మూఁగుచోఁటు.
బలురోగవంతుల కనుతాపగృహము.
బీభత్సదేవతా వాసస్థలంబు.
మానవసేవ నేర్పఁగ పాఠశాల,
సువిశాల వైద్యాలయమునందుఁ జేర్చి
బాలుని యారోగ్యసంవర్ధమునకు,
రామనాథము చాల శ్రమఁ బొందెఁ గాని,
లాభ మించుకయైన నగుపింప లేదు!—
తెల్లవాఱె నసంతపుణ్యవ్రతంబు.
సముచితోపకరణ నికరంబు గూర్చి
శారద వైద్యాలయముఁ జేరఁబోయె!
జనులసందడి లేని యానిశీథమున
ఇనుపమంచమునందుఁ గనుమోడ్చియున్న
నిజకుమారునిఁ గాంచి— కన్నీరు నించి—
మనసార పలుమాఱు కొసరి ముద్దాడె!
"అమ్మా!" యని యతఁడు పొరపాటువలన,
కలవరించినయట్లు పిలిచి మూర్ఛిల్లె!—

"కడు పుణ్యవతులైన సతులగర్భమునఁ
బుట్టక నా కెందులకుఁ బుట్టినావు!
కటకటా! నేనింక సైరింపఁ గలనె?—
నాజీవనావధి నాకింక లేదు!—
అని వేగ రామనాథముఁ జేరఁ జీరి,
నచియించెఁ గనులారఁ గనుఁగొన్నమాట!

తెల్లవాఱెను గొల్లు జగమెల్ల నిండె.—
వ్రతవిధానము పూర్తి యగునంతలోన,
సంజచీఁకటి ప్రాఁకె వైద్యాలయమున
బాలుఁడు కన్మోడ్చి మైఁ బాసిపోయె!—

ఆరాత్రి శారద శయ్యాగృహంబుఁ
జేరి మృణాలబాహు వుపధానముగ
శయనించి కన్నీటివఱదలో మునిఁగి,
"పుత్త్రకా! వాత్సల్య మొక మాయ యేని?
మన కీభవంబున ఋణమెల్లఁ దీఱె!"—
అని నిద్రపోయెను!— మఱి లేవ లేదు!—

* * * *

ఉపవాసవ్రతమున వసివాళ్లు వాడి
మరణించె నని లోకులు దలంచినారు!

జమీన్‌దారులు — వ్యవసాయక్షేత్రములు

మందపాటి సత్యనారాయణరాజు గారు

పూర్వమునుండియు, మహారాజులు, జమీనుదారులు, మొఖాసాదారులు మొదలైన భూమిఖామందులు పెక్కు సేరీలను నెలకొల్పినట్లిప్పటికిని నిలిచియున్న కొన్ని జమీనుదారీ సేరీలవలన తెలియుచున్నది.

పూర్వ మిట్టిసేరీలు ఎందునిమిత్తము స్థాపించినది, సేరీలయొక్క ప్రాముఖ్య మెట్లుండినది, భూమిఖామందులు రైతులయెడల నెట్టి బాధ్యత కలిగియుండెడివారైనది మొదలైన కొన్ని విషయములను విశదీకరించుచున్నాను.

భూమిఖామందులు ఆయాచోట్ల స్వంత సేరీలను నెలకొల్పి స్వయముగా పంటలు పండించి, భూములకు శిరమువారిశిస్తుగాని, రాజభాగం విననుల్లు గాని అన్యాయములేకుండ ఏర్పాటుచేసి రైతులకు భూములను సాగున కిచ్చుటకై మొట్టమొదట నిట్టిసేరీలను నెలకొల్పినట్లు కానవచ్చుచున్నది.

ఇటీవల రైతుప్రజ తమకు కొంతభూమిని సాగుచేయనిచ్చి దానిపైని సాలుసరిపన్నులు వసూలుచేసికొను భూమిఖామందును సర్కారనియు శివాణమనియు పిల్చుకొనుచు సర్వకష్టసుఖములకును వారిపైనే యాధారపడియుండునట్లు అనుష్ఠించెను. భూమిఖామందులు కూడ రైతుప్రజకు సర్వవిధముల తోడ్పడుచు వారి తగవుధర్మములను తీర్చుచు ప్రజాపోషకరణము కలిగి మిక్కిలి ఖ్యాతిని పొందుచుండెడివారు. మఱియు నతివృష్టి యనావృష్టిదోషములచే పంటలు పోయినయెడల భూమిఖామందులు రైతులను పన్నులకొఱకు నిర్బంధపఱకుండుటయే గాక రయితు నిలువలేక పారిపోవుననే కారణముచే రయితునకు కావలసిన విత్తనములు, పశువులు, మొదలగువానిని అరువిచ్చుట భూమిఖామందులవిధి యాయెను. అందుచే రయితులకు మంచి విత్తనములు, పశువులు మొదలైనవి సులభముగా లభించుటకును, జమీనుదారులకు కావలసిన పాడిపంటలకును, మంచి ధాన్యపురకములను పశువులను వివిధ జాతుల ఫలవృక్షములను నితరస్థలములనుండి తెప్పించి అత్యుత్సాహముతో వ్యయప్రయాసములకు లక్ష్యముచేయక అపారమైన కృషి సలుపుచుండెడివారు. ఇట్టి సేరీలకై తెప్పించిన ఢిల్లీభోగములు మొదలైన ధాన్యములు-ఒంగోలు ఢిల్లీ ఆవులరకములు-బొబ్బిలిపోతులు- మొదలైనవి రైతులకు సులభముగా లభించుటకే